# ప్రణవ పద్మాకరం

సెప్టెంబర్, 2025



# దసరా శుభాకాంక్షలు



# సెప్టెంబర్ , 2025



సెప్టెంబర్ , 2025

## విషయ సూచిక

సంపుటి-4
సంచిక-9


| | | |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 02 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 03 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నిడుముక్కల శ్రీకరి |
| 04 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 05 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 06 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 07 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 08 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 09 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |


శ్రీ మహాగణాధిపతయే నమః    శ్రీ గురుభ్యోనమః    శ్రీ మాత్రే నమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




"నేను వైకుంఠాన్ని విడిచి అయినా ఉంటాను కానీ నా భక్తులను మాత్రం విడిచి ఉండలేను" అనేది శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రతిజ్ఞ. స్వామి ఆ ప్రతిజ్ఞను నిలబెట్టుకుంటున్న విధానాన్ని కనులకు కట్టి చూపించే అద్భుత రచన 'శ్రీ వెంకటేశ్వర విలాసం'. స్వామి వారి నివాస స్థలమైన తిరుమల, తిరుమల లోని వివిధ తీర్థములు, వివిధ పర్వతములు, దేవాలయములు, వాటి మహత్తుతో పాటు వాటిని దర్శించవలసిన విధి విధానములు సరళంగా, వివరంగా మనసుకు హత్తుకునే విధంగా వివరించ బడిన ఈ గ్రంథం పఠించిన వారు నిస్సందేహంగా ఆధ్యాత్మిక బల సంపన్నులు కాగలరు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

# సంపాదకీయం

## శ్రావణ భాద్రపదాలు - పుణ్యప్రదాలు



**భాద్రపదమాసం** "భాగవతమాసం". భాద్రపద పూర్ణిమనాడు బంగారు సింహాసనం పై భాగవతాన్ని ఉంచి ఊరేగించి, దానం చేసిన వాడు శాశ్వత కైవల్యం పొందగలడు అని భాగవతం 12వ స్కంధంలో 13వ అధ్యాయంలో 13వ శ్లోకంలో వ్యాసుడు వివరించాడు. అందుకే నైమిశారణ్యంలో ఈ మహాకార్యక్రమం చేస్తున్నాము. భక్తులు పాల్గొని తరించండి. ఈ భాద్రపదపూర్ణిమనాడు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడింది. గ్రహణస్నానం, సువర్ణదానం ఇహపరాలకు సోపానం.మాతాపితరులను ప్రత్యక్ష దైవాలుగా శాస్త్రాలు పేర్కొన్నాయి. తల్లిదండ్రులను పూజించక ఎన్ని మంచి పనులు చేసినా వ్యర్థాలే. కనుక వారిని గౌరవిస్తూ వారితో పాటుగా భార్యను, సంతానాన్ని సరిగ్గా చూస్తూ సంసారాన్ని ఆనందమయం చేసుకోవాలని భారతం చెబుతున్నది. భాద్రపద కృష్ణ పక్ష పాడ్యమి నుండి అమావాస్య వరకు మహాలయ పక్షాలలో పితృదేవతలను అర్చించండి. మీ కోసం పితృదేవతాస్తోత్రం అందించాం. అది యూట్యూబ్లో Brahmasri Vaddiparti Padmakar Official ఛానల్ లో ఉంటుంది. ఈ కాలంలో అది వినండి.

అనంతరం శరత్కాలం ఆరంభం అవుతున్నది. మహిషాసురుడు, దుర్గముడు, శుంభనిశుంభాదులవంటి వారిని సంహరించి మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతి అనబడే మూడు రూపాలలో పరాశక్తి ఈ కాలంలో లోకాలలో సంచరిస్తూ లోక సంరక్షణ చేస్తున్నది. ముగ్గురమ్మలను పూజించి తరిద్దాం. సరస్వతీకవచం, మహాలక్ష్మీస్తోత్రం, దుర్గాష్టకం మీకోసం యూట్యూబ్లో ఉంది. వినండి. కుమారీపూజ శుభాలను అందించే పూజ. చేసి తరించండి. దుర్గానామమే ఒక మహామంత్రం. ధర్మానికి అమ్మయే ఆధారం. ధర్మబద్ధమైన జీవితాన్ని గడిపే వారికి ఆధారమై, అమ్మ ఆదుకుంటుంది. దేవీనామాలన్నీ మంత్రాలే. మననం చేయడం వలన రక్షించునది కావున మంత్రము అనే పేరు వచ్చింది. ఆ మంత్రస్వరూపిణియే మహాశక్తి. ఐశ్వర్యానికి, పరాక్రమానికి పరిరక్షించే అమ్మను ధ్యానిద్దాం. అమ్మవారి అనుగ్రహం మీపై ప్రసరించాలనీ అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను........

లోకాః సమస్తాః సుఖినో భవంతు.

వద్దిపర్తి పద్మాకర్

# శ్రీ గణేశ పురాణం

**పార్వతీదేవి** కోపాన్ని తొలగిస్తూ ప్రీతి పూర్వకంగా విష్ణువు జగన్మాతతో ఇలా అన్నాడు – జగన్మాతా! మంగళదేవీ! సర్వమంగళా! నీవు రాగద్వేషాలకు అతీతురాలవు. గణపతి, కుమారుడు ఎటువంటివారో భార్గవరాముడు కూడా అటువంటి వాడే. మీ పార్వతీపరమేశ్వరులు వీరందరినీ సమానంగా చూస్తారు. భేదబుద్ధి చూపించరు. అయిందేదో అయ్యింది. సర్వం నీకు తెలిసే జరుగుతున్నది. ఇక నుండి మహాత్ముడైన గణపతి ఏకదంతుడు అని పిలవబడతాడు. దేవతలందఱూ అతడిని ఈ పవిత్ర నామంతో కీర్తించి, గౌరవిస్తారు.

శ్లోII పుత్రనామాష్టకం స్తోత్రం సామవేదోక్తమీశ్వరి II
(బ్ర.వై.పు.తృతీయఖండం.అ.44.శ్లో.84)

సామవేదంలో నీ పుత్రుడైన గణపతికి ఒక స్తోత్రం ఉంది. అది గణేశనామాష్టకం అని ప్రసిద్ధికెక్కుతుంది. ఆ నామాలను చదివినా, విన్నా, ఇతరులకు వినిపించినా సమస్త విఘ్నాలు తొలగుతాయి. శుభాలు కలుగుతాయి. నీకు వినిపిస్తాను. విను.

శ్లోII గణేశ మేకదంతం చ, హేరంబం విఘ్ననాయకం
లంబోదరం శూర్పకర్ణం, గజవక్త్రం గుహా గ్రజమ్ II
అష్టాఖ్యార్థం చ పుత్రస్య శ్రుణుమాతః హరప్రియే
స్తోత్రాణాం సారభూతం చ సర్వవిఘ్నహరం పరమ్ II
(బ్ర.వై.పు.తృతీయఖండం.అ.44.శ్లో.85,86)

(1) గణేశుడు (2) ఏకదంతుడు (3) హేరంబుడు (4) విఘ్ననాయకుడు (5) లంబోదరుడు (6) శూర్పకర్ణుడు (7) గజవక్త్రుడు (8) గుహాగ్రజుడు — ఈ ఎనిమిది గణపతి అష్టనామాలుగా ప్రసిద్ధికెక్కుతాయి. ఇవి అత్యంత పవిత్రమైనవి. ఈ నామాలను ఉదయం పఠిస్తే విఘ్నాలు తొలగుతాయి. మధ్యాహ్నం పఠిస్తే కార్యసిద్ధి కలుగుతుంది. సాయంత్రం, రాత్రి పఠిస్తే సకల శుభాలు, ఆరోగ్యం, ఐశ్వర్యాదులు లభిస్తాయి. 40 దినాలు ఈ నామాలను విడువక మూడు పూటలా పఠించిన వాడు అనుకొన్న పనులు నెరవేర్చుకోగలుగుతాడు. సర్వత్ర విజయం పొందుతాడు.



.. ఇంకా ఉంది

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

శ్లో॥ శ్రీ వేంకటేశ్వరే దేవే తీర్థాని సకలాని హి ॥
విద్యంతే సర్వ దేవాశ్చ మునయః పితరస్తథా
ఏకకాలం, ద్వికాలం వా త్రికాలం సర్వదైవ వా
యే స్మరంతి మహాదేవం శ్రీనివాసం విముక్తిదమ్
కీర్తయంత్యధవా విప్రాః తే ముక్తాః పాప పంజరాత్ ॥
(స్కాం.పు.వేం.మా.అ.18.శ్లో.5,6,7)

**సకలతీర్థాలు** శ్రీ వేంకటేశ్వరునిలోనే ఉన్నాయి. సర్వదేవులు, మునులు, పితరులు మున్నగువారందరూ శ్రీ వేంకటేశునిలోనే ఉన్నారు. శ్రీనివాసుడు విముక్తి ప్రసాదించే దైవం. ఆయనను ఒకసారి కాని, లేక రోజునకు రెండుసార్లు, లేక మూడు సార్లు గాని స్మరించిన వారు, నిత్యం ఆ మహాదేవుని స్మరించినవారు (వారి వారి భక్తి శ్రద్ధలను బట్టి) పాప పంజరం నుండి ముక్తిని పొందుతారు. పరమభక్తులు, మిక్కిలి శ్రద్ధాసక్తులు కలవారు జీవితంలో ఒకే ఒక్కసారి ఆ స్వామిని స్మరించినా ముక్తి పొందగలుగుతారు. శంకరుడు బ్రహ్మ మున్నగు మహాత్ముల చేత కూడా పూజింపబడే శ్రీవేంకటేశ్వరుడు, సాక్షాత్తు నారాయణుడు. పరదైవం. ఆయనను స్మరించినంత మాత్రం చేత యముని భయం జీవునకు కలగదు. ఇంతెందుకు? దానాలు, వ్రతాలు, తపస్సులు, యజ్ఞాలు చేసిన వారికంటె శ్రీ శ్రీనివాసుని ఒకే ఒకసారి అర్చించినవాడు ధన్యుడు. పుణ్యుడు. సార్థకజీవి. స్వామిని స్మరింపనివాని సర్వపుణ్యకార్యాలు వ్యర్థాలు. శ్రీనివాస స్మరణ చేయనివాడు అజ్ఞాని.శ్రీ వేంకటేశద్వేషికి ఎప్పుడూ శుభాలు కలగవు.

....ఇంకా ఉంది



# పురాణం లో మహిళలు

## లోపాముద్ర

**పురాణ** కథలు మన సంస్కృతిని, జ్ఞానన్ని, ధర్మాన్ని ప్రతిబింబించే అమూల్యమైన నిధులు. వీటిలో మహిళలు అసాధారణమైన పాత్రలు పోషించారు. అలాంటి గొప్ప మహిళల్లో లోపాముద్ర ఒకరు. ఆమె జీవితం, ఆమె పాతివ్రత్యం, ఆమె జ్ఞానం, ధైర్యం మనకు స్ఫూర్తినిస్తాయి.

### లోపాముద్ర జననం, బాల్యం

విదర్భ దేశాన్ని సత్యవ్రతుడు అనే రాజు పరిపాలించేవాడు. అతను ఎప్పుడూ సత్యం మాట్లాడటం వల్ల సత్యవ్రతుడని పిలవబడ్డాడు. అతని దేశంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవించారు. సత్యవ్రతుడికి చాలా కాలం తర్వాత లోపాముద్ర అనే కుమార్తె జన్మించింది. రాజు, రాణి ఆమెను ప్రాణంతో సమానంగా చూసుకుని, ఎంతో గారాబంగా పెంచారు. ఆమె ఏ చిన్న కారణంతో నైనా ఏడిస్తే వారు కలత చెందేవారు.లోపాముద్రకు తగిన వయస్సులో విద్యాభ్యాసం ప్రారంభమైంది. ఒక బ్రాహ్మణుడిని ఆమెకు గురువుగా నియమించారు. ఆమె తీక్షణమైన బుద్ధి కలిగి ఉండటం వల్ల, గురువు చెప్పిన పాఠాలను త్వరగా గ్రహించి, స్త్రీలకు అవసరమైన విద్యలను సులభంగా నేర్చుకుంది. తల్లి దగ్గర నీతి, సత్ప్రవర్తన కూడా నేర్చుకుంది. యవ్వనంలో ఆమె సౌందర్యం, బంగారంలా మెరిసాయి.

### అగస్త్యునితో వివాహం

లోపాముద్ర సౌందర్యం, సత్ప్రవర్తన గురించి విని, అనేక మంది రాజకుమారులు ఆమెను వివాహం చేసుకోవాలని ఆశించారు. వారి ఆశ నెరవేరలేదు అయితే, ఒక రోజు మహర్షి అగస్త్యుడు సత్యవ్రతుడి కొలువుకు వచ్చాడు. అగస్త్యుడు గొప్ప ఋషి. అతను వాతాపి, ఇల్వలుడు అనే రాక్షసులను సంహరించాడు, సముద్ర జలాన్ని ఒక్క దోసిటతో పీల్చాడు, వింధ్యపర్వత గర్వాన్ని అణిచి వేసాడు. అతని గొప్పతనం చూసి సత్యవ్రతుడు ఎంతో ఆదరించాడు.అగస్త్యుడు తన పితృదేవతలు తనను వివాహం చేసుకోమని కోరినట్లు చెప్పాడు. లోపాముద్ర గుణాలు, సత్ప్రవర్తన విని, ఆమెను వివాహం చేసుకోవాలని కోరాడు. సత్యవ్రతుడు ఈ కోరికను లోపాముద్రకు చెప్పగా, ఆమె సంతోషంగా అంగీకరించింది. లోపాముద్ర సంతోషంగా అగస్త్యుని వివాహం చేసుకుంది. ఆ వివాహం ఘనంగా జరిగింది. లోపాముద్ర అత్తవారింట సాధారణ జీవనశైలిని స్వీకరించి, సేవకులను వారించి, స్వయంగా భర్తకు సేవ చేసింది. ఒకసారి అగస్త్యుడు ఆకలితో ఉన్నానని చెప్పగా, లోపాముద్ర ఒక కలశంలో పాలు తెచ్చి, అవి అక్షయంగా ఉండేలా ప్రార్థించింది. అగస్త్యుడు ఎంత తాగినా ఆ కలశం నిండుగా ఉండటం ఆమె పాతివ్రత్య శక్తిని చూపింది.తర్వాత లోపాముద్ర భర్తతో ఆశ్రమానికి వెళ్ళింది. ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఖరీదైన వస్త్రాలను వదిలి, సాదాసీదా నారచీరలు ధరించింది. ఆశ్రమంలో వారికి ఒక కుమారుడు జన్మించాడు. ఒకసారి మునులను ఆహ్వానించినప్పుడు, భోజన సామగ్రి లేకపోయినా, లోపాముద్ర తన భర్త పాదాలను స్మరించి, వంటింటిని ఆహారంతో నింపింది. ఇది ఆమె పాతివ్రత్య మహిమ.

### లోపాముద్ర మహిమ

ఒకసారి విపులుడు, విమలాంగి అనే దంపతులు ఆశ్రమానికి వచ్చారు. విమలాంగి లోపాముద్రను ఆభరణాల గురించి అడిగితే, ఆమె ఒక చెట్టును చూపించింది. ఆ చెట్టు కొమ్మలపై ఎన్నో ఆభరణాలు వేలాడుతున్నాయి. ఇది చూసి విమలాంగి ఆమె మహిమకు ఆశ్చర్యపడి నమస్కరించింది. లోపాముద్ర ఒక రాజకుమారిగా జన్మించి, ఋషి పత్నిగా, పాతివ్రత్య శక్తితో ప్రకాశించింది. ఆమె జీవితం స్త్రీల గొప్పతనాన్ని, జ్ఞానాన్ని, ధైర్యాన్ని చాటుతుంది. ఆమె కథ మన సంస్కృతి యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తుంది. లోపాముద్ర జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుంది.

# ఐశ్వర్యయోగం



ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 346. విజయా - (ఓం ఐం హ్రీం శ్రీం విజయాయై నమః)

**అమ్మవారున్నచోట,** అమ్మవారి అనుగ్రహం ప్రసరించినచోట విజయమే ఉంటుంది. విజయాన్ని ఇచ్చే అమ్మ విజయ. ‘విశిష్ట జయకారిణీ విజయా’ అని మంత్రశాస్త్రాలు చెపుతున్నాయి. ముహూర్తాలలో ‘విజయ’ ముహూర్తము కూడా ఒకటి. ఆ ముహూర్తము అమ్మవారి స్వరూపము. జయ, విజయ అనబడే ఇద్దరు ద్వారపాలకురాండ్రు లేక స్నేహితురాండ్రు అమ్మవారికి ఉన్నారు. వారిలో విజయ అనబడే ఆమె రూపంలో ఉంటుంది అని మరొక అర్థం. విజయునికి (అర్జునునకు) విజయం చేకూర్చి పెట్టడం వల్ల విజయగా అమ్మను అర్జునుడు, కృష్ణుడు కూడా సంబోధించారు. శ్రీమద్భాగవతంలో ఈ క్రింది శ్లోకాలు ఉన్నాయి. ఈ రెండు కృష్ణుడు యోగ మాయతో పలికిన శ్లోకాలే.

శ్లో॥ నామధేయాని కుర్వంతి స్థానాని చ నరా భువి
దుర్గేతి భద్రకాళీతి, విజయా వైష్ణవీతి చ
శ్లో॥ కుముదా చండికా కృష్ణా మాధవీ కన్యకేతి చ
మాయా నారాయణీశానీ శారదేత్యంబికేతి చ ॥
(శ్రీమద్భాగవతం.దశమస్కంధం.అ.2.శ్లో.11,12)

అమ్మా! నిన్ను మానవులు 14 నామాలతో అర్చిస్తారు, అని శ్రీకృష్ణుడు అమ్మవారితో అన్నాడు. ఆ నామాలలో మూడవ నామం విజయ. మూడక్షరాల మహానామం. గొప్ప మంత్రం. ఆ మంత్ర నామ స్వరూపిణి అమ్మ.

### మంత్రప్రయోగవిధానం — ఫలితం

ఈ మంత్రాన్ని 1008 సార్లు జపించి ఆపై ఆ సెనగలు ముగ్గురు ముత్తైదువులకు ఇచ్చుకుంటే భర్త ఆరోగ్యవంతుడై జపం చేసిన సాధకురాలు సౌభాగ్యవతిగా ఉంటుంది. విదేశాలకు వెళ్ళి తిరిగి రాలేక బాధపడుతున్నవారిని తిరిగి స్వదేశాలకు తీసుకురావడానికి 9 రోజులు ఈ మంత్రాన్ని రోజూ 1008 సార్లు జపిస్తూ తులసీదళాలతో పూజించాలి. ప్రమాదాలలో మతిపోయి తనను తాను మరచిపోయిన వారికి తిరిగి జ్ఞాపకం తెప్పించడానికి సంవత్సరకాలం ఉమ్మెత్తపూలతో అమ్మవారిని పూజిస్తూ రోజూ 108 సార్లు ఈ మంత్రం జపిస్తే అద్భుతఫలితం లభిస్తుంది. కీర్తి కావాలనుకునేవారు ఉత్తరాయణ పుణ్యకాలమంతా అనగా సంక్రాంతి నుంచి తొలిఏకాదశి వరకు రోజూ ఈ మంత్రాన్ని 11 సార్లు జపించండి. శరీరం ధృడంగా, బలంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకునేవారు, ఈ మంత్రాన్ని 6 నెలలపాటు రోజూ 27 సార్లు అమ్మవారి సన్నిధిలో జపించి, ఆవుపాలు నివేదించి, అవి త్రాగితే చాలు సంపూర్ణారోగ్యం మన సొంతం. ఎముకలు పటుత్వం లేక బాధపడేవారు, రోజూ ఈ మంత్రాన్ని 18 సార్లు జపించండి. సంపదలకోసం మహాలక్ష్మీదేవాలయంలో ఈ మంత్రాన్ని 9 శుక్రవారాలు 108 సార్లు జపించండి.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

# ఋషి చరిత్ర

## అగస్త్యమహర్షి

**అగస్త్య** మహర్షి ఒక ఆశ్రమాన్ని స్థాపించాడు. ఇది వాయువ్య మహారాష్ట్రలో గోదావరి నది ఒడ్డున, అగస్త్యపురి మరియు అకోలా అనే చిన్న పట్టణాల సమీపంలో ఉన్నదని కొందరి భావన. మరి కొందరు తమిళనాడులో తిరునల్వేలి, పోతియల్ కొండలు లేదా తంజావూరులో ఉందని నమ్ముతారు. మహాభారతంలో, ముఖ్యంగా వనపర్వ విభాగంలో అగస్త్య మహర్షి ప్రస్తావన ఉంది. ఈ ఇతిహాసం ఇంద్రుడు మరియు వృత్రాసురునికి మధ్య జరిగిన యుద్ధాన్ని వివరిస్తుంది. ఈ కథలో, సముద్రంలో దాక్కున్న రాక్షసులను నిర్మూలించడానికి దేవతలు అగస్త్యుడి సహాయం కోరారు. అగస్త్యుడు చాకచక్యంగా సముద్రాన్ని తాగి, దేవతలను ఓడించడానికి రాక్షసులను బహిర్గతం చేసాడు. పాపనాశంలోని అగస్తియే ఫాల్ (కళ్యాణ తీర్థం) వద్ద ఉన్న శ్రీ అగస్తియార్ ఆలయం మరియు అలోగర్కోవిల్ నుండి కేవలం 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎ. వీలపట్టి (మధురై జిల్లా)లోని అరుల్మిగు చందంబర వినాయగర్ తిరుకోయిల్ వద్ద ఉన్న శ్రీ లోపాముద్ర సమేత అగస్తియార్ దేవాలయం ముఖ్యమైన ఉదాహరణలు.అగస్త్య మహర్షి శాస్త్రంలో ఒక మార్గదర్శకుడు, 4000 సంవత్సరాల క్రితం భారతదేశంలో బ్యాటరీని కనుగొన్నట్లు ప్రసిద్ధి చెందాడు. విద్యుత్ ఉత్పత్తికి ప్రాథమిక సూత్రం అగస్త్య మహర్షి వివరించిన పురాతన సూత్రాలపై ఆధారపడి ఉంటుంది. ఆయన పుస్తకం "అగస్త్య సంహిత" విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అంతర్దృష్టులను కలిగి ఉంది. నీటిని హైడ్రోజన్ మరియు ఆక్సిజన్‌గా ఎలా విభజించవచ్చో కూడా ఇది వివరిస్తుంది. "అగస్త్య సంహిత" ఎలక్ట్రోప్లేటింగ్ కోసం విద్యుత్తు వినియోగాన్ని మరింత వివరిస్తుంది. బ్యాటరీని ఉపయోగించి రాగి, బంగారం లేదా వెండిని పాలిష్ చేసే పద్ధతులను ఆయన కనుగొన్నారు. అటువంటి అద్భుతమైన ఆవిష్కరణల కారణంగా, అగస్త్యుడు "బ్యాటరీ జననం" అనే అర్థం వచ్చే "కుంబోర్భవ" అనే బిరుదుతో గౌరవించబడ్డాడు.అగస్త్య మహర్షి జీవితం మనం తెలుసుకోవాల్సిన గొప్ప ఆదర్శం. ఆయన్ను కేవలం ఋషిగా కాక, సంస్కృతికర్తగా, విజ్ఞానప్రదాతగా, ధర్మరక్షకుడిగా చూడాలి. వేదసంస్కృతి దక్షిణభారతానికి విస్తరించడంలో ఆయన పాత్రను మనం మరచిపోలేం. ఆధ్యాత్మికత, శాస్త్రత, సామాజిక విలువలు అన్నింటికీ కలయికగా నిలిచిన అగస్త్యుని జీవితం మన తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

.ఇంకాఉంది



# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం



**విఘ్నేశ్వరుడు** 56 రూపములను ధరించి కాశీ యందు నివసించసాగాడు. ఏడు ఆవరణములుగా 56 రూపములతో గణపతి కాశీయందు స్థిరముగా నివాసముండెను. ఒక్కొక్క ఆవరణలో ఎనిమిది గణపతి రూపములను ధరించి కాశీక్షేత్రంలో ఉంటూ ఈనాటికీ భక్తులను అనుగ్రహిస్తున్నారు. మంథర పర్వతం నుండి గౌరీ సమేతుడై కాశీ వచ్చిన శివుడు. ఢుంఢి గణపతిని స్తుతించెను. గణపతిని గౌరీ సమేతముగా స్తుతించిన ఈశ్వరుడు ఈ విధముగా చెప్పెను. ఓ  ఢుంఢి గణపతి కాశీకి వచ్చు భక్తులు ముందుగా నిన్ను సేవించిన తరువాతనే నన్ను సేవించవలెను, ఆ విధముగా చేసిన వారి ప్రాణములు పోవు సమయమున వారి చెవియందు పునర్జన్మ లేకుండా ఉండు విధంగా నేను ఉపదేశమును ఇస్తాను. కాశీ వచ్చిన వారు ముందుగా మణికర్ణికలో స్నానము చేయాలి ఆ తరువాత దైవ, ఋషి, పితృ దేవతలకు తర్పణములను ఇవ్వాలి, ఆ తరువాత జ్ఞానవాపిని చేరాలి అక్కడ జ్ఞానవాపిని సేవించిన పిమ్మట  ఢుంఢి గణపతి సన్నిధి చేరి యధాశక్తిగా అర్చించి తరువాత నా చెంతకు చేరి నన్ను పూజించిన వారి మనసులో ఉన్న ధర్మ బద్ధమైన కోరికలు అన్నింటిని తీరుస్తాను.

శ్లో॥ స్నాత్వానరః ప్రథమతో మణికర్ణికాయా

ముద్ధూళితాంఘ్రి యుగళన్తు సచైలమాశు

దేవర్షి మానవ పితౄనపి తర్పయిత్వా

జ్ఞానోద తీర్థమభిలభ్య భజేత్తతస్త్వామ్ ॥

కాశీ లో ఇతర తీర్థములను సేవించినా,సేవించుకున్న నీ అనుగ్రహం వల్ల  ....

.ఇంకాఉంది

# శ్రీ శివమానసపూజా స్తోత్రమ్

రత్నైః కల్పితమాసనం హిమజలైః స్నానం చ  దివ్యాంబరం

నానారత్నవిభూషితం మృగమదామోదాంకితం చందనమ్ |

జాతీచంపక బిల్వపత్రరచితం పుష్పం చ ధూపం తథా

దీపం దేవ దయానిధే పశుపతే హృత్కల్పితం గృహ్యతామ్ ||1||

సౌవర్ణే నవరత్నఖణ్డరచితే పాత్రే ఘృతం పాయసం

భక్ష్యం పంచవిధం పయోదధియుతం రంభాఫలం పానకమ్ |

శాకానామయుతం జలం రుచికరం కర్పూరఖణ్డోజ్జ్వలం

తాంబూలం మనసా మయా విరచితం భక్త్యా ప్రభో స్వీకురు ||2||

ఛత్రం చామరయోర్యుగం వ్యజనకం చాదర్శకం నిర్మలం

వీణాభేరి మృదంగ కాహలకలా గీతం చ నృత్యం తథా |

సాష్టాంగం ప్రణతిః స్తుతిర్బహువిధా హ్యేతత్సమస్తం మయా

సంకల్పేన సమర్పితం తవ విభో పూజాం గృహాణ ప్రభో ||3||

ఆత్మా త్వం గిరిజా మతిః సహచరాః ప్రాణాఃశరీరం గృహం

పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః |

సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వా గిరో

యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్ ||4||

కరచరణకృతం వాక్కాయజం కర్మజం వా

శ్రవణనయనజం వా మానసం వాఽపరాధమ్ |

విహితమవిహితం వా సర్వమేతత్క్షమస్వ

జయ జయ కరుణాబ్ధే శ్రీ మహాదేవ శంభో ||5||

ఇతి శ్రీమచ్ఛంకరాచార్యవిరచితం శివమానసపూజాస్తోత్రమ్ సమాప్తమ్ ||



## త్రయస్త్రింశతి అధ్యాయః



శ్రీ ప్రణవ పీఠం భూమి పూజా కార్యక్రమాల్లో ఒక విచిత్రం చోటుచేసుకుంది.ఆ స్థలమునకు దగ్గరగా ఉన్న గుడిసెలో ఉంటున్న ఒక బాలుడికి మాటలు వచ్చేవి కావు.ఆ పూజా కార్యక్రమంలో హఠాత్తుగా ఆ బాలుడు మాట్లాడటం మొదలుపెట్టాడు.ఇది ఒక అద్భుతమైన విషయం,అమ్మవారి కృప.ఆ బాలుడికి వైద్యం చేస్తున్న వైద్యుడు ఈ విషయం తెలుసుకొని అమ్మవారిపై భక్తితో పీఠస్థాపనకు విరాళము ఇచ్చారు. ప్రణవ పీఠం స్థాపనకు పునాదులు వేసిన గురువుగారు పీఠం నిర్మాణం కొరకు చాలా కృషి చేసారు. పూజ్య గురుదేవులు 2008వ సంవత్సరంలో బెంగళూరు మహానగరంలో భాగవత సప్తాహమునకు పూనుకున్నారు. అక్కడి నిర్వాహకులు గురుదేవుల పరిసర ప్రాంతాల యాత్రకు గురువుగారి ద్వారా అనుమతి తీసుకున్నారు. సప్తాహ కార్యక్రమమునకు మరొక రోజు సమయం ఉండడం వల్ల గురుదేవులు చెన్నై మహానగరం సమీపాన ఉన్న మహాబలిపురానికి భక్తులతో కలిసి చేరుకున్నారు.అక్కడ అమ్మవార్ల విగ్రహములను చేయించడానికి శిల్పితో మాట్లాడారు. కొంత సొమ్మును ముట్టచెప్పాలి అని శిల్పి కోరగా, విగ్రహాల నమూనాలు చూడటం కోసమే వచ్చిన గురువుగారు, సొమ్మును తన వెంట తీసుకురాకపోవడంతో ఆలోచనలో పడ్డారు. అదే సమయంలో పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక అజ్ఞాత భక్తుడు ఆ సమయంలో శిల్పికి ఇవ్వవలసిన సొమ్మును తాను ఇస్తానని చెప్పి సొమ్ము అందించి విగ్రహ స్థాపనకు బాటలు వేసారు. ఇది అమ్మ సంకల్పం అని గురుదేవులు అమ్మకు నమస్కరించుకున్నారు. ఆ తర్వాత తిరిగి బెంగళూరు మహా నగరానికి చేరుకుని గురువుగారు సప్తాహమును కూడా పూర్తి చేసుకున్నారు. బెంగళూరులో గురుదేవులకు ఆతిథ్యం ఇచ్చిన పుణ్యదంపతులు విగ్రహముల కొరకు గురువు గారి ప్రయత్నం గురించి తెలుసుకొని అమ్మవారి అనుగ్రహంతో విగ్రహ తయారీకి కావల్సిన సొమ్మును మొత్తం తామే ఇస్తామని ప్రకటించడమే కాకుండా వెంటనే సొమ్మును కూడా అందజేసారు.

... ఇంకా ఉంది